క్లుప్తంగా

'రిస్క్' టీజర్ విడుదల చేసిన భట్టి



టీజర్ విడుదల చేస్తున్న భట్టి విక్రమార్క

కొత్తగూడెంరూరల్: నిర్మాణంలో ఉన్న రిస్క్ చిత్రం టీజర్‌ను ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో మద్దెల శివకుమార్, సంగీత దర్శకులు ఘంటాడి కృష్ణ, హీరో సాయిరాంశంకర్, కాంగ్రెస్ నాయకుడు బండ్ల గణేశ్ పాల్గొన్నారు.

మాస్‌లైన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఇల్లెందు: కోల్‌కతాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల జూనియర్ వైద్యురాలిపై అత్యంత పాశవికంగా లైంగికదాడికి పాల్పడి, హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఇల్లెందులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మాస్‌లైన్ అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకూబ్ షావలి మాట్లాడుతూ.. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని, కానీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పాయం వెంకన్న, దాసరి సంధ్య, వరలక్ష్మి, అరుణ, రమణ, దుర్గ, రమ, పుష్ప, నాగమణి, స్వప్న, పద్మ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

టేకులపల్లి: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన అమానుష హత్యాకాండపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు జర్పుల సుందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితోనే సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, వయసుతో సంబంధం లేకుండా లైంగికదాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు.

కుక్క కాటుకు బాధ్యులెవరు?

కొత్తగూడెంఅర్బన్: కుక్క కాటుకు బాధ్యులెవరని, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పని తీరుకు ఇది నిదర్శనమని ఓ పాదచారుడు మున్సిపల్ సిబ్బందిని నిలదీశాడు. అనిశెట్టిపల్లికి చెందిన రాజు కొత్తగూడెంలో ఇంటి నిర్మాణ పని కోసం వచ్చాడు. రామాటాకీస్ ఏరియాలో నడుచుకుంటూ వెళ్తున్న ఆయన్ను కుక్క కరవడంతో నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చాడు. మున్సిపల్ కమిషనర్ రూం ఎక్కడా? అంటూ ఆరా తీశాడు. అనంతరం పారిశుద్ధ్య విభాగం అధికారులు రాజుకు సర్దిచెప్పడంతో ఆస్పత్రికి వెళ్లాడు. అధికారులను నిలదీయడానికి కార్యాలయానికి వచ్చిన రాజును అక్కడివారు అభినందించారు.

సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లతో మహిళలు

చుంచుపల్లి: విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు మంగళవారం కొత్తగూడెంలో కుట్టు మిషన్ ట్రెనింగ్ సర్టిఫికెట్లను జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆకుల నాగేశ్వరగౌడ్ మాట్లాడుతూ.. పీఎం విశ్వకర్మ యోజన దేశంలోనే అతిపెద్ద పథకమని, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా పీఎం విశ్వకర్మ యోజన 40 మంది లబ్ధిదారులకు కుట్టు మిషన్ ట్రెనింగ్ సర్టిఫికెట్ అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరాజు, సీహెచ్ హబీబా, బేబీ పాల్గొన్నారు.

పని కల్పించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ పరిధిలో ఏళ్లుగా ఉన్న నీటి సరఫరా కాంట్రాక్ట్ కార్మికులందరినీ పనిలోకి తీసుకోవాలే తప్ప టెండర్లలో సాంకేతిక కారణాలను చూపుతూ ఇబ్బంది పెట్టొద్దని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికుల్లో కొందరికే పని కల్పించడం సరికాదని, ఇకనైనా అందరికీ ఉపాధి చూపాలన్నారు. సమావేశంలో నాయకులు క్రిస్టోఫర్, ఎర్రగాని కృష్ణయ్య, రమేశ్, ప్రవీణ్, కార్మికులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సమస్యలెన్నో..

ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం

- స్థానికులను వేధిస్తున్న సమస్యలు
- నిధులు లేక సౌకర్యాల కల్పనలో జాప్యం
- జగన్నాథపురం గిరిజన పీహెచ్‌సీలో ఇక్కట్లు



ఆస్పత్రిలో సిబ్బంది, చికిత్స కోసం వచ్చినవారితో ఇరుకుగా మారిన గది

పాల్వంచరూరల్: మండలంలోని జగన్నాథపురం – కేశవాపురం నడుమ కొలువైన పెద్దమ్మతల్లి ఆలయం ఎదుట ఉన్న గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అక్కడికి చికిత్స కోసం వచ్చే వారిని ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల కంటే దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దుతామని పాలకులు చెబుతున్నా ఆచరణలో ఆ పరిస్థితి కానరావడం లేదు. నిధులు రాక, సౌకర్యాలు లేక జగన్నాథపురంలో 12 గంటల పాటు మాత్రమే పనిచేసే పీహెచ్‌సీ సమస్యలకు నిలయంగా మారింది.

2014లో ప్రారంభం

పెద్దమ్మతల్లి గుడి సమీపాన 2004లో అద్దె భవనంలో గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిత్యం 60 నుంచి 70 మంది చికిత్స నిమిత్తం వస్తుంటారు. ఆరు పడకలతో కూడిన ఈ పీహెచ్‌సీ పరిధిలో ఎనిమిది సబ్ సెంటర్లు ఉండగా, ములకలపల్లి, బూర్గంపాడు మండలాల్లోని 58 గ్రామాల ప్రజలకు సేవలందించాల్సి ఉంది. ఆస్పత్రిలో డాక్టర్ గది, హాల్, ఇన్ పేషంట్ వార్డు ఉన్నా ఇన్ పేషంట్ వార్డులో కేవలం ఒక బెడ్ వేసే స్థలమే ఉంది. ఇదేగదిలో ఆస్పత్రి సామగ్రి నింపడంతో రోగులకు అసౌకర్యంగా మారింది. మిగిలిన ఐదు బెడ్లు వేసేందుకు సరిపడా స్థలం లేక మూలన పడేశారు. అలాగే, రోగులకు, వైద్యసిబ్బందికి అవసరమైన మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేవు.

రెండు దఫాలు నిధులు వచ్చినా..

ఆస్పత్రి భవన నిర్మాణం కోసం 1998లో రూ.40 లక్షలు మంజూరైనా స్థలం లేక జాప్యం జరగడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. మళ్లీ 2003లో రూ.65 లక్షలు మంజూరు కాగా గుడికి సమీపాన రెవెన్యూ అధికారులు చూపించిన స్థలంలో ఆస్పత్రి నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఇంతలోనే ఓ వ్యక్తి భూమి తనదని కోర్టును ఆశ్రయించడంతో పనులకు బ్రేక్ పడటంతో ఆ నిధులూ వెనక్కి మళ్లాయి. గ్రామంలో హైస్కూల్ ఎదుట కొందరు కలిసి రూ.4 లక్షలు



ఇన్‌పేషంట్ గదిలో వేసిన సామగ్రి

వెచ్చించి స్థలం కూడా కొనుగోలు చేశారు. అక్కడ భవనం నిర్మిస్తామని నవభారత్ కంపెనీ యాజమాన్యం ఆరు నెలల కిందట ముందుకొచ్చినా అడుగులు పడలేదు.

భవన నిర్మాణానికి ప్రతిపాదనలు



జగన్నాథపురంలోని గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణం కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు సమర్పించాం. ఈ నిధులు మంజూరు కాగానే భవన నిర్మాణం చేపడతాం. అప్పటివరకు సిబ్బంది, రోగులు ఇబ్బంది పడకుండా చూస్తాం.

–డాక్టర్ భాస్కర్‌నాయక్, జిల్లా వైద్యాధికారి

ఇరుకుగదులతో ఇబ్బంది



గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం రోగులకు ఇబ్బందికరంగా మారింది. గదులు ఇరుకుగా ఉండటంతో మాకూ అవస్థగానే ఉంది. నూతన భవనం నిర్మిస్తేనే మా సమస్యలు పరిష్కారమవుతాయి. ఈ సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

–డాక్టర్ రాజు, జగన్నాథపురం పీహెచ్‌సీ

ఎవరూ పట్టించుకోవడం లేదు



పీహెచ్‌సీ భవన నిర్మాణానికి పదేళ్ల కిందట స్థలం కొనుగోలు చేశాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే భవన నిర్మాణం చేపట్టే అవకాశం ఉంది. ఈ విషయమై డీఎంహెచ్‌ఓకే కాక ప్రజాప్రతినిధుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

–బి.వెంకటనారాయణ, జగన్నాథపురం

అర్హులందరికీ రుణమాఫీ



సుజాతనగర్: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



టేకులపల్లి: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సుజాతనగర్: అర్హులందరికీ రుణమాఫీ జరిగేలా సర్కారు చర్యలు తీసుకుంటోందని కొత్తగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు రమేశ్ అన్నారు. రుణమాఫీ కానీ రైతుల కోసం స్థానిక రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డులు లేకపోవడం, బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడం, కుటుంబ నిర్ధారణ జరగని ఖాతాలు, ఆధార్ కార్డులో తప్పులు, పాస్ బుక్ నంబర్లు లేకపోవడం, ఆధార్‌లో ఒక పేరు, ఖాతాలో మరో పేరు ఉండటం వంటి సాంకేతిక కారణాల మూలంగా అర్హుల జాబితాలో రైతుల పేర్లున్నా కొందరికి రుణమాఫీ కాలేదన్నారు. రుణమాఫీ కాని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గ్రీవెన్స్‌లో వారు దరఖాస్తు అందజేయాలని తెలిపారు. సుమారు నెల రోజుల పాటు ఈ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఓ జి.నర్మద, ఏఈఓలు శరత్, ప్రనూష, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: రుణమాఫీపై మండలంలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డులో పేర్లు, వివరాల్లో తప్పులు, బ్యాంకు ఖాతాలో, రేషన్‌కార్డు, ఆధార్ కార్డులో పేర్లకు స్పెల్లింగ్ తప్పులు, ఫోన్ నంబర్, ఆధార్ లింకేజీ తదితర సాంకేతిక సమస్యల వల్ల రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకున్నారు. మండలంలోని క్లస్టర్ల వారీగా బోడు 38, గంగారం 30, గొల్లపల్లి 32, టేకులపల్లి 20, కోయగూడెం 18 మొత్తం 138 మంది రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏఓ నీరుడు అన్నపూర్ణ, ఏఈఓలు రమేశ్, శ్రావణి, భార్గవి, విశాల, రెహానా, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

30న హైదరాబాద్‌లో ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌లోని ఎస్‌పీడీ కార్యాలయం ఎదుట ఈ నెల 30న నిర్వహించే ధర్నాకు కేజీబీవీ కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఇఫ్టూ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఇఫ్టూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేజీబీవీల్లోని బోధనేతర సిబ్బందికి కనీస వేతనాలు, బేసిక్ పే అమలు తదితర డిమాండ్లతో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు ఆర్.మధుసూదన్‌రెడ్డి, షేక్ యాకూబ్‌అలీ, గోనెల రమేశ్, వై.గోపాల్‌రావు, పెద్దబోయిన సతీశ్, మల్లెల వెంకటేశ్వర్లు, పాయం వెంకన్న, చంద్రశేఖర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

జూలూరుపాడు ఏఓగా దీపక్ ఆనంద్



దీపక్ ఆనంద్

జూలూరుపాడు: జూలూరుపాడు మండల వ్యవసాయశాఖ అధికారి (ఏఓ)గా దీపక్ ఆనంద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏఓగా ఉన్న ఎస్.రఘుదీపిక కొత్తగూడెం ఏడీఏ కార్యాలయానికి బదిలీ కాగా ఆ స్థానంలో డీఏఓ కార్యాలయం నుంచి దీపక్ ఆనంద్‌ను కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతులు పడమటనర్సాపురం, కాకర్ల, పాపకొల్లు, జూలూరుపాడు రైతు వేదికల్లో ఏఈఓలకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న దీపక్ జాన్

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మైనార్టీ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. మంగళవారం స్థానిక వికలాంగుల కాలనీలో జిల్లాస్థాయి పాస్టర్ల సమావేశాన్ని నిర్వహించగా.. దీపక్ జాన్ మాట్లాడారు. మైనార్టీల కోసం విద్య, సామాజిక, ఆర్థికాభివృద్ధికి పలు పథకాలు ప్రభుత్వం కల్పిస్తోందని, విదేశాల్లో విద్య, ఉద్యోగాలు అందిపుచ్చుకునేందుకు రుణ సదుపాయాలు ఉన్నాయన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా మాట్లాడుతూ.. పాస్టర్ల సమస్యలను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జాన్ విల్సన్, సదానందం, అనిల్, దేవదాస్, యేసుదాస్, రవి, దయాకర్, వరహాల రాజు, డేవిడ్‌రాజు, పాస్, అహరోను, టైటస్ లివింగ్ వాటర్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



జూలూరుపాడు: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: ఈ నెల 22న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా పిలుపునిచ్చారు. మంగళవారం జూలూరుపాడులో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్క్ వరకు భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. రాయల సిద్ధు, లింగాల వీరభద్రం, వాంకుడోత్ శరత్, ధర్మా, రాములు, నరేశ్, ధనవంతరావు పాల్గొన్నారు.

పాల్వంచ: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని అమలు చేయాలని మాస్‌లైన్ నాయకుడు నిమ్మల రాంబాబు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 24న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మంగళవారం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం రాంబాబు మాట్లాడారు. పూనెం రమేశ్, కె.భాస్కర్, వెంకటేశ్వర్లు, పార్వతి, దినకర్, బి.సత్యం పాల్గొన్నారు.

'ప్రశ్న' విజ్ఞానానికి తొలిమెట్టు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు

ఇల్లెందురూరల్: ప్రశ్న విజ్ఞానానికి తొలిమెట్టు వంటిదని, ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ టి.ప్రభాకర్‌రావు సూచించారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నేషనల్ సైంటిఫిక్ డేను ఘనంగా నిర్వహించగా ఆయన మాట్లాడారు. మానవ హక్కుల కార్యకర్త డాక్టర్ నరేంద్ర దబోల్కర్ మహారాష్ట్రలో మూఢ విశ్వాసాల నిర్మూలన సమితిని స్థాపించి, సమాజంలో మూఢ నమ్మకాలను తొలగించడానికి, పౌరులను చైతన్య పరచడానికి కృషి చేశారని చెప్పారు. ఆయన 2013 ఆగస్టు 20వ తేదీన దుండగుల చేతిలో హతమయ్యాడని, దబోల్కర్ సమాజంలో రగిలించిన చైతన్యాన్ని అందిపుచ్చుకుంటూ ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

'భూమాత' పరిష్కార వేదికగా ఉండాలి



మాట్లాడుతున్న న్యాయవాది సాధిక్‌అలీ

కొత్తగూడెంఅర్బన్: గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌తో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, ధరణి స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న భూమాతను భూ సంబంధిత అన్ని సమస్యల పరిష్కార వేదికగా రూపొందించాలని తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ ఎండీ సాధిక్‌అలీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ స్థానంలో భూమాత పోర్టల్‌ను తీసుకొని వచ్చే ఉద్దేశంతో జారీ చేసిన కొత్త ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదా 2024పై సాధిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కొమరం భీం స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలోని సమావేశ మందిరంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సాధిక్‌అలీ మాట్లాడుతూ.. ధరణి వలె భూమాత పోర్టల్ కూడా సమస్యల పుట్టగా మారకుండా చూడాలని, ప్రతి గ్రామంలో ఆర్వోఆర్ రికార్డు ఉంచాలని, ఆ రికార్డులో యజమాని, పట్టేదారు, కౌలుదారు, అనుభవదారుడు వంటి కాలమ్‌లు కొనసాగిస్తూ, భూమి శిస్తూ తదితర పాత విధానాలను అమలు పరచాలని తెలిపారు. కొన్ని మార్పులు, చేర్పులతో మరోసారి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భూమాత పోర్టల్‌ను సమగ్రంగా రూపొందించి, పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు దేవదానం, టీజేఎస్ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు ఎస్కే నబీసాహెబ్, బహుజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు శ్రీపాద సత్యనారాయణ, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు మోహన్ నాయక్, కేశవనాయక్, కుషాల్‌నాయక్, అల్లూరి సత్యనారాయణ, మంజు, నజుమ, సోయం సత్యనారాయణ, దుర్గ, సలీం పాల్గొన్నారు.

పాఠశాలలో 'వృక్ష రక్షాబంధన్'



చెట్టుకు రాఖీ కడుతున్న ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం 'వృక్ష రక్షా బంధన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే మొక్కలకు, చెట్లకు రాఖీ కట్టించి 'వృక్షో రక్షతి రక్షితః' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా వినూత్న ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎ.సాయిసుజాత మాట్లాడుతూ.. విరివిగా మొక్కల్ని నాటి వాటిని సంరక్షించే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పూల్‌సింగ్, వనిత, మల్లీశ్వరి, శ్రీదేవి, శివరంజని, ఉష, కళ్యాణి, నాగప్రసన్న, దేవప్రియ, మంజులత, కుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రాంపురంతండాలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: మండలంలోని గుండ్లరేవు గ్రామ పంచాయతీ రాంపురంతండాలో మంగళవారం జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్వరబాధితుల రక్త నమూనాలను సేకరించామని, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు కూడా వైద్య సేవలు అందించామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశాల ఎదుట సీఐటీయూ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

ఇల్లెందు: ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ప్రతీ నెల వేతనాలు చెల్లించకపోవటం వల్ల సూర్యాపేట వైద్యశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి షేక్ వాసీం మృతి చెందాడంటూ ఆరోపిస్తూ ఇల్లెందులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ విధానంలో కొందరు ఉద్యోగులను తీసుకుని ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తోందన్నారు. సకాలంలో వేతనాలు ఇవ్వకపోవటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు

మాజీ ప్రధాని, దివంగత రాజీవ్‌గాంధీ 80వ జయంతిని మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలతోపాటు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. దేశ సేవలో భాగంగా ఆయన తన ప్రాణాలను కూడా అర్పించారని పేర్కొన్నారు.



పాల్వంచ: కేక్ కట్ చేస్తున్న కొత్వాల శ్రీనివాసరావు, నాయకులు

ఇల్లెందు: ఇల్లెందులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, దొడ్డా డానియేల్, పులి సైదులు, సుదర్శన్ కోరీ, కొక్కు నాగేశ్వరరావు, కమల్‌కుమార్‌కోరీ, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: మండలంలో కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్‌నాయక్, కొలిపాక వెంకటేశ్వర్లు, దుద్దుకూరి శ్రీనివాసరావు, వేల్పుల నరసింహారావు, కొదుమూరి కోటేశ్వరరావు, ధర్మరాజుల వెంకటనారాయణ, పోతురాజు నాగరాజు పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో భూక్యా దేవానాయక్, కోరం మహాలక్ష్మి, బండ్ల రజిని, కోరం సురేందర్, ఈది గణేశ్, ఇస్లావత్ రెడ్డి, మధు రెడ్డి, మూడ్ సంజయ్, బానోత్ శంకర్, శివ పాల్గొన్నారు.



సింగరేణి(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న నేతలు

రామవరంలో..

సింగరేణి(కొత్తగూడెం): రామవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎండీ రజాక్, జానీపాషా, హరిసింగ్, దొమ్మేటి నాగేశ్వరరావు, ఎస్కే హుస్సేన్, సత్యరాజ్, లక్ష్మీనారాయణ, కొమరయ్య, సారంగపాణి, మోహన్ రెడ్డి, శ్రీనివాస్, బోలాసింగ్, సమ్మయ్య పాల్గొన్నారు.



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

పాల్వంచలో..

పాల్వంచ: కార్యక్రమంలో కొత్వాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, నూకల రంగారావు, ఎస్‌ఏ జలీల్, బద్ది కిశోర్, జమ్ముల సీతారాంరెడ్డి, ఆచార్యులు, సురేశ్, కాల్వ భాస్కర్, కాపర్తి వెంకటాచారి, నారాయణ పాల్గొన్నారు.